
# అర్హత

యం. చంద్రశేఖర్



"అమ్మా! ఆకలేస్తుందే, అన్నం పెట్టవూ?"

శుష్కించిపోయిన ఎముకల గూడులాంటి ఆ చిన్నారి శరీరం ఆకలనే దావాగ్నిలో రగిలిపోతూ, అంతిమవిజయం ఆ చిన్నారిని వరించకపోగా, ఆ కార్చిచ్చు శరీరమంతా ప్రాకి చివరికి నోట్లో నుండి మాటల రూపంలో వెలువడింది.

'హాయిగా తిని, నిశ్చింతగా ఆడుకొనే ఈ వయసులో ఏమిటీ దారిద్ర్యం?' అన్నంకోసం ఆరాట పడే ఆ ఆరేళ్ళ పసివాడ్ని చూస్తుంటే లత గుండెలు తరుక్కుపోయాయి.

"కొంచెం ఆగు నాన్నా! అన్నయ్య బజారు కెళ్ళాడు గదా, రాగానే ఐదు నిముషాల్లో వండి పెట్టేస్తాను నీకు, అక్కకి" అంటూ వాడ్ని దగ్గరకు తీసుకొని వాళ్ళో కూర్చో బెట్టుకొని చుట్టూరా చూసింది. ఏమైనా వుంటే ప్రస్తుతానికి దానితో వాళ్ళ ఆకలి తీరుద్దామని.

అది వ్యర్థప్రయత్నమని లతకి తెలుసు. అయినా ఆశ. మనిషిలో 'ఆశ' అనేది వుండకపోతే ఈ ప్రపంచంతో రాజీ పడతాడేమో? ఆశ జీవిత గమ్యానికి రాచబాట వంటిది. కానీ తనలాటి జీవితాలలో ఆశల కెప్పుడూ చుక్కెదురే!

"అమ్మా! అన్నయ్యెప్పుడొస్తాడో!" వాడిలో సహనం నశిస్తూంది.

"అమ్మా! నాకూ ఆకలేస్తుందే! త్వరగా అన్నం వండి పెట్టవూ?" పదేళ్ళ పద్మ తల్లి ప్రక్కన చేరింది.

"కొంచెం ఆగండమ్మా! అన్నయ్య రాగానే మీ ఇద్దరికీ వండి పెట్టేస్తానుగా!" లోలోపల వస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుతూ ఇద్దరినీ లాలించింది.

'సంవత్సరం క్రితం తన ఇల్లు ఎంత కళకళ లాడుతుండేది. ఆకలనేది ఎలా వుంటుందో తనకిగాని, తన పిల్లలకిగాని తెలుసా అప్పుడు? ఆయన హఠాత్తుగా అందరినీ వదిలేసి కాలగర్భంలో కలవకపోతే బహుశా ఈ పాటికి కూడా ఆకలనే పదానికి అర్థం తెలిసేది కాదేమో? పెద్ద ఉద్యోగం, మంచి హోదా, ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు. అందులో పెద్దవాడు వినయ్. ప్రయోజకుడై చేతికందే సమయంలో.... హే భగవాన్! ఏమిటీ పరీక్ష నాకు? నా నుదుటి కుంకుమని 'హార్టు అటాక్' రూపంతో చెరిపేసి దాని మీద దురదృష్టవంతురాలని ఎందుకు సృష్టించావు?'

"అమ్మా! అన్నయ్యొచ్చాడే!" అంటూ తల్లిప్రక్క నుండి లేచి ఆనందంతో అన్నయ్య దగ్గిరికి పరుగెత్తికెళ్ళిన పద్మ, భాస్కర్‌లకి ఆ సంతోషం ముఖం మీద తాండవించినంత సేపు పట్టలేదు-నల్లగా మాడిపోవడానికి.

వినయ్ చేతిలోనున్న ఖాళీ

సంచి వెక్కిరించింది ఇద్దరినీ.

వినయ్ మౌనంగా ఖాళీ సంచిని గోడకున్న మేకుకి తగిలించి షర్టు గుండీలు విప్పుకోసాగాడు.

పిల్లలిద్దరూ గుడ్ల నీరు నింపుకొంటూ తిరిగి తల్లి ప్రక్కన చేరారు.

లతకి కొడుకు మౌనం చూడగానే అర్థమయిపోయింది- వెచ్చాల కొట్లో బియ్యం అరువు దొరకలేదని. ఇప్పటికే వెచ్చాలవాడికి చాలా బాకీ వున్నారు. ఇప్పుడు అప్పుడు అంటూ ఇంతకాలం వాడికి డబ్బులివ్వకుండానే అప్పు తెచ్చుకున్నారు. వాడు మాత్రం ఎంతకాలమని నిస్తాడు? పోనీ, ఇంకెక్కడయినా ప్రయత్నిద్దాం అంటే ఎక్కడ? ఎవరిస్తారు? ఇప్పటికే వూరంతా శక్తి వంచన లేకుండా అప్పులు చేసారు. తెలిసిన వారెవ్వరూ తమకు అప్పు ఇవ్వరు. అయినా ఇలా ఎంత కాలం- ఆదాయం లేకుండా కూర్చొని తినడం? వినయ్‌కి ఉద్యోగం దొరికేవరకు. అదొక్కటే 'ఆశ'-తనని, పిల్లల్ని బతికిస్తుంది.

దీనంగా చూసింది కొడుకువైపు లత.

సంవత్సరం క్రితం వరకు నుదుటి బొట్టుతో మెడలో మంగళ సూత్రాలతో 'పార్వతీదేవి' లా నిత్య నూతనంగా వుండే తన తల్లి ముఖం, ఈ రోజు ఇలా బోసిపోవటం తను చూడలేనట్లు ముఖం ప్రక్కకి తిప్పుకొని తిరిగి షర్టు వేసుకోసాగాడు.

"ఎక్కడకి వినయ్....?" లత స్వరం నూతిలోనుండి వచ్చినట్లుంది.

వినయ్ మాట్లాడ లేదు. మౌనంగా తను చదివిన డిగ్రీ పుస్తకాలన్నీ కలిపి సంచిలో వేస్తున్నాడు.

లతకి వెంటనే అర్థమయిపోయింది- వినయ్ ఏం చెయ్యబోతున్నాడో. అప్పటివరకు ఎప్పుడైనా అప్పు దొరకని రోజు ఇంట్లో వున్న వస్తువులకి కాళ్ళొచ్చి ఒక్కొక్కటే నడిచి వెళ్ళిపోయాయి. వాటిల్లో వినయ్ ఇంటర్ ఫస్టుక్లాసులో పాసయినప్పుడు తండ్రి సంతోషంతో కొనిచ్చిన ఎలక్ట్రానిక్ రిస్ట్‌వాచ్, ఇంకొకసారి వాడి జన్మదిన కానుకగా చేయించిన రాళ్ళు పొదిగిన బంగారు వుంగరం కూడా వున్నాయి. అన్నీ అయిపోయాయి. ఇక మిగిలిందల్లా వాడు చదివిన చదువుకి సాక్ష్యంగా వున్న పుస్తకాలు.

"బాబూ- వినయ్!" బాధగా అంది లత.

తలెత్తి తల్లివైపు చూసాడు వినయ్. "అమ్మా! చేతికి ఓ డిగ్రీ వచ్చింది. ఇంకా ఎందు కమ్మా ఈ పుస్తకాలు? ఆ డిగ్రీ కాగితం ఎలాగూ కూడు పెట్టదు. కనీసం ఈ పుస్తకాలైనా నా తమ్ముడికి, చెల్లెలికి ఈ పూట తిండి పెట్టగలిగితే నా చదువు సార్థకమైనట్లే!" వినయ్ కంఠం గద్గదమైంది.

"పోనీ, మళ్ళీ వొకసారి మామయ్య దగ్గర కెళ్ళరాదా వినయ్?" భయపడుతూనే అంది లత.

విసురుగా తలెత్తి కోపంగా తల్లివైపు చూసాడు. "అమ్మా! పేరుకి నాకు మామయ్య- నీకు అన్నయ్య. వరుసలు బాగానే వున్నాయి, కాని ఈ సంవత్సర కాలంలో వొక్క రోజైనా మన బాగోగుల గురించి పట్టించు కొన్నాడా? నాన్న పోయినప్పుడు వచ్చాడు. మళ్ళీ ఎప్పుడైనా మన గడప త్రొక్కాడా ఈ సంవత్సర కాలంలో? 'కష్టంగా వుంది. కాస్త సహాయం చెయ్య' మని నీవు వాళ్ళ యింటికి వెళ్ళి ప్రాధేయపడితే, తోడబుట్టిందన్న అభిమానం కూడా లేకుండా, కాఫీనీళ్ళు కాదుకదా కాస్త కనికరం కూడా చూపెట్టకుండా పెళ్ళాం మాటలు విని- 'వెధవ' ముఖం చూడకూడదంటూ వెళ్ళ కొడతాడా నిన్ను?" ఆవేశంతో వూగిపోతున్నాడు వినయ్.

నిజమే! వినయ్ అన్నది అక్షరాలా నిజం. ఆయన బ్రతికున్నపుడు ఆయన హోదాచూసి 'నా చెల్లెలు, నాచెల్లి పిల్లలు' అంటూ ఆప్యాయత వొలకబోసేస్తూ తన ఇంటిలో రోజుల తరబడి తిన్న రోజులు మర్చిపోయాడు. 'మా సంధ్య మీ కోడలే' అంటూ వినయ్‌ని, సంధ్యని జోడించేసి వాళ్ళని సినిమాలకి, షికార్లకి పంపిన రోజులు మర్చిపోయాడు.

ఇప్పుడు రోజులు మారాయి కదూ! ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యాయి. తమని దారిద్ర్య మనే పిశాచి వెంటాడింది. 'బావా- బావా' అంటూ పూర్వపు అనురాగ బంధాలు తెంచుకోలేక తల్లీ తండ్రి తన గుమ్మం త్రొక్కక పోయినా, 'అత్తయ్యా' అంటూ వచ్చి ఆప్యాయతగా పలుకరించే సంధ్యనికూడా- "నీవు ఆ దరిద్రపుగొట్టు వాళ్ళింటికి వెళ్ళటానికి వీలు లేదు. వినయ్ తోటి మాట్లాడటానికి అసలు వీలు లేదు. వినయ్‌ని శాశ్వతంగా

మర్చిపో!" అంటూ దానిమీద ఆంక్షలు విధించాడు. పాపం! ఆ ప్రేమ హృదయం అటు తల్లి తండ్రులను, ఇటు ఆత్మీయులను వదులుకోలేక తల్లడిల్లిపోతుంది.

"ఏమిటమ్మా, ఆలోచిస్తున్నావు? ఈ పుస్తకాలమ్మి, చెల్లికి తమ్ముడికి ఏమైనా తీసుకువస్తాను. అంత దాకా వాళ్ళని సముదాయించు" అంటూ తల్లి జవాబుకి కూడా ఎదురు చూడకుండా పుస్తకాల సంచితో బయటకు వెళ్ళిపోయాడు వినయ్.

కొడుకు వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయింది లత.

* * *

సెకండ్ హేండ్ పుస్తకాల షాపుకి వెళ్ళాలంటే మైలు దూరం నడవాలి. బస్సులు వున్నాయి అక్కడికి. కానీ టికెట్టు కొనటానికి డబ్బులు లేవు తనదగ్గర. ఉన్నా, అవి ఇంటిలో దేనికయినా పనికి వస్తాయని నడిచే వెళ్ళేవాడు- ఎంత దూరమైనా. దారిద్ర్యం ఎంత భయంకరమైనది? ఇంతకు మునుపు తను కనీసం ఫర్లాంగు దూరమైనా నడిచి వెళ్ళేవాడా, ఎక్కడికయినా? హైక్లాసులో సినిమాలు. అప్పటి ఒకరోజు సినిమా ఖర్చుతో ఈ రోజు సునాయాసంగా అందరం ఒకపూట భోజనం చెయ్యొచ్చు. హైక్లాసు సంగతి ఆ పై వాడికెరుక. సినిమాహాలు ముఖం చూసి ఎన్నాళ్ళయిందో? తనెన్ని కష్టాలు పడినా ఫర్వాలేదు. కానీ తన తమ్ముడికి, చెల్లెలికి ఏలోటూ రానీయకూడదు. "తమ్ముడిని, చెల్లిని జాగ్రత్తగా చూసుకో వినయ్!" తండ్రి అన్న చివరి మాటలు గుర్తుకి వచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి వినయ్‌కి. వుబికి, వుబికి వస్తున్న దుఃఖాన్ని బలవంతాన నిగ్రహించుకున్నాడు.

తను బియస్సీ సెకండు క్లాస్‌లో పాసయినా తనకింతవరకూ ఉద్యోగం దొరకలేదు. కనీసం తన తండ్రి హఠాత్తుగా పోయినందుకు 'హ్యూమానిటేరియన్' గ్రౌండ్స్‌లో నాన్న చేసిన కంపెనీలో తనకు ఉద్యోగమిస్తారని ఆశపడ్డాడు. కాని ఆ ఆశలు అడియాశలని కొద్ది కాలంలోనే గ్రహించాడు. కాళ్ళావేళ్ళాపడ్డా లాభం లేకపోయింది. మామయ్య ఏదయినా ఉద్యోగం తెలిసినవారి ద్వారా ప్రయత్నిస్తాడని ప్రాధేయ పడ్డాడు. కాని అదికూడా వృథా ప్రయాస అని త్వరలోనే తేలిపోయింది.

డిగ్రీ వుంది. టైపు లోయర్ హైయర్ సర్టిఫికేట్స్ వున్నాయి. అన్నీవున్నా, చిన్న టైపిస్టు వుద్యోగము కూడా సంపాయించలేకపోతు

న్నాడు. లోపం ఎక్కడుంది?.... తను చదివిన చదువులోవుందా? లేక ఈ విద్యావ్యవస్థలోనే వుందా లోపం? చదువుకున్నా ఉద్యోగం ఇవ్వలేని ఈ విద్యావ్యవస్థ ఎందుకు- తగలెయ్యడానికి... ప్రభుత్వం వేసే పంచవర్ష ప్రణాళిక లేమవుతున్నాయి? లేక మారని ఈ సంఘంలోనే వుందా లోపం? అర్హత వుండికూడా వుద్యోగం దొరకక పోవటమేమిటి? విద్యార్హత తోపాటు ఇంకో అర్హత వుండి తీరాలి కాబోలు. ఉత్తరమా- దక్షిణమా?... ఆ రెండూ తనకు లేవు. పోనీ అవి లేకపోయినా వాటితో సమానమైన అర్హతలింకేమైనా వున్నాయా- అంటే అవీలేవు తన దగ్గర. మరి ఉద్యోగమెలా వస్తుంది ఏవీ లేకుండా ...?

నాన్న బ్రతికుంటే తనకి ఉద్యోగము వెతుక్కోవలసిన అవసరం ఎందుకుండేది? హాయిగా ఎం.యస్సీ మొదటి సంవత్సరంలో వుండేవాడు. నిజంగా కాలేజీ రోజులు ఎంత మధురమైన రోజులు. ఆ రోజుల్లో భావిజీవితం పంచరంగుల్లా కనపడింది తనకి. మరి ఇప్పుడు ... కనీసం బ్లాక్ అండ్ వైట్ లోకూడా కన్పించటంలేదు. అంతా చీకటే. తనింత వ్యధ చెందుతున్నాఅప్పుడప్పుడు ఎక్కడో ఒకమూల ఆశా కిరణం తళుక్కుమనేది-సంధ్యరూపంలో. ఈమధ్య ఆ సంధ్య రూపంకూడా అస్తమించి పూర్తిగా అమావాస్య నాటి అంధకారం అలముకుంది- తన జీవితంలో. సంధ్య తనని ప్రేమిస్తుంది. తనూ సంధ్యని ప్రేమిస్తున్నాడు. కాని ఏంలాభం?....తను నిస్సహాయుడు. తన అసమర్థతమీద తనకే కోపం, అసహ్యం కలిగాయి. 'నీదీ ఒక బ్రతుకేనా! ఉద్యోగం సంపాయించలేవు. నిన్నుప్రేమించి నిన్నే నమ్ముకున్న హృదయ రాణిని నీ దాన్నిగా చేసుకోలేవు. ఎందుకీ బ్రతుకు?.... ఇలా బ్రతికే కంటే చావే మేలు' అంతరాత్మ రొదపెడుతుంది.

'నీకు మరణమే శరణ్యం...!'

'నో! నేను చావకూడదు. నేను బ్రతకాలి. చచ్చి సాధించేదేమిటి? నా తమ్ముడిని చెల్లెల్ని పైకితీసుకురావాలి. అమ్మకి ఆసరాగా విలవాలి. సంధ్యని తన దాన్నిగా చేసుకోవాలి. కానీ ఎలా?.. వీటన్నిటికీ ఒక్కటే సమాధానం-'ఉద్యోగం.' ఉద్యోగం సంపాయించాలి. అప్పుడే తన చిందర వందర ఆలోచనలకి ఒక రూపం ఏర్పడుతుంది.' దగ్గరకు వచ్చేశాడు. పుస్తకాల దుకాణం

ఇంకెంతోదూరం లేదు. గబ గబా అడుగులేస్తున్నాడు వినయ్. 'అరే! ఇదేమిటి, తను ఇలా అయిపో తున్నాడు? అడుగులు తడబడు తున్నాయి. నాలుక తడారిపోతుందే? మనుష్యులందరూ మసక మసకగా మారుతున్నారేమిటి...?

ప్రపంచమంతా ఎందుకిలా అయిపోతుంది- మబ్బు మబ్బుగా. లేక తనే మారిపోతున్నాడా? ఇదే మిటి? తను తూలిపోతున్నాడు- త్రాగిన వాడిలా. భూకంపమా? అయ్యో! తనకేమవుతుంది? ఆ కారెందుకు- అలా తన మీదకి దూసుకొని వచ్చేస్తుంది? తనమీదకి వచ్చేసింది. అమ్మా!..' చేతిలోపుస్త కాల సంచి గాలిలో పైకెగిరి అల్లంత దూరంలో పడి దాంట్లో వున్న పుస్తకాలు చెల్లాచెదుర య్యాయి.

* * *

రెండు నెలల తర్వాత హాస్పి టల్ నుండి డిస్చార్జ్ చేసారు వినయ్‌ని. సెంట్రల్ జైలు నుండి విముక్తి పొందిన ఖైదీలా ఆ నాల్గు గోడలమధ్యనుండి బయటపడ్డాడు. కాని సరైన అవయవాలతో కాదు- ఒక చచ్చు కాలుతోటి, చేతిలో కర్రతో. ఏక్సిడెంటులో ఎడమకాలు మీదనుండి కారు చక్రం పోవ డంతో నరాలన్నీ నజ్జునజ్జయి పోయాయి. ఆ కాలు ఇక దేనికీ పనికిరాదని డాక్టర్లు చెప్పేసారు. కాలు తీసేస్తే మొండి కాలుతో అసహ్యంగా వుండేది. ఇది కాస్త నయం అనుకొన్నాడు వినయ్.

ఇంట్లో కాలుపెడుతూ ఇల్లంతా ఒకసారి కలయచూసిన వినయ్ కొంచెం ఆశ్చర్యపోయాడు- కొత్తగా వచ్చిన వస్తువులని చూసి. 'ఖరీదైన సామగ్రి కాకపోయినా అసలవి ఎలా వచ్చాయి? తనకి ఏక్సిడెంట్ అయినప్పుడు తమ దగ్గర కనీసం చిల్లర డబ్బులైనా లేవే- మరి ఇవన్నీ? ఈ రెండు నెలలు ఎలా గడిచింది.?' అదే అడి గాడు అమ్మని వినయ్, "ఎవరిచ్చారే డబ్బు?"

"నిన్నీస్థితికితీసుకొచ్చినవారు." ముభావంగా చెప్పింది లత.

కొడుకుని అటువంటి స్థితిలో చూడాలంటేనే కడుపు తరుక్కు పోతూంది. చేతికంది వచ్చిన కొడుకు ప్రయోజకుడైనా ఫలితం దక్కలేదు. తన కుటుంబానికి ఆశా దీపం! 'ఆశ' అలాగే వుంది. దీపం మాత్రం కొడిగట్టుకు పోయింది. అంతా తన తలరాత. లేకపోతే ఆయన పోయిన శోకం తీరనేలేదు, ఇంతలో వీడికిలా అవడమేమిటి?

విధి తమని చూసి ఓర్వలేక తమ జీవితాలతో ఆటలాడుకుంటుంది.

"ఎంతిచ్చారమ్మా?"

"వెయ్యి!" ఆలోచనలనుండి తేరుకొని సమాధానమిచ్చింది లత.

తన కాలు ఖరీదు వెయ్యి రూపాయలన్న మాట. ఆ లెక్కన తన పూర్తి అవయవాలకి వెల కడితే పదివేలు కూడా రావు. ఐనా అమ్మ ఎలా తీసుకొంది- వాళ్ళ దగ్గర? తీసుకోక ఏం చేస్తుంది? ఇంట్లో పైసా లేదు. పైగా కొడుకు ఆస్పత్రిలో వున్నాడు. గత్యంతరం లేక తీసుకొని ఉంటుంది.

తను ఆస్పత్రిలో వుండగా ఎవ్వరూ తనని చూడ్డానికి రాలేదు- ఇద్దరు ముగ్గురు స్నేహితులు తప్ప. అప్పుడప్పుడు సంధ్య వచ్చి వెళ్ళింది- అదీ ఇంట్లో వాళ్ళకి తెలియకుండా.

ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో వాళ్ళని వీళ్ళని బ్రతిమిలాడి తన పేరుని 'ఫిజికల్లీ హాండీకాప్డ్'గా దాంట్లో ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఆ రిజస్ట్రేషన్‌తో త్వరలోనే ఉద్యోగం సంపాదించాడు వినయ్.

క్వాలిఫికేషన్ వుండి ఫిజికల్లీ హాండీకాప్డ్ కాబట్టి ఆ కోటాలో 'సూపర్‌వైజర్' పోస్టు దొరికింది. నెలకి ఏడెనిమిది వందలదాకా వస్తుంది.

రోజూ రిక్షాలో వెళ్ళి రిక్షాలో వస్తున్నాడు. మొదట్లో కొంత మంది హేళనగా 'కుంటికులాసం' అని వెక్కిరిస్తూ సంబోధించినప్పుడు బాధపడేవాడు. ఇప్పుడు అలాంటివాటికి అలవాటు పడ్డాడు. రోజులు గడుస్తున్న కొలదీ వినయ్ లోని మంచి గుణం, తెలివితేటలు చూసి ఆఫీసులో అందరూ చేరువ కాసాగారు. జీవితం సాఫీగా నడుస్తుంది. ముందుటలా ఆకలి బాధలు లేవు. తమ్ముడ్ని, చెల్లెల్ని తన సంపాదనతో చదివిస్తూ వాళ్ళకి కావలసినవన్నీ సమకూర్చగలుగుతున్నాడు.

అమ్మ కూడా ఇప్పుడిప్పుడే కోలుకొంటుంది. తన జీవితానికో సార్థకత ఏర్పడింది. అన్నీ తీరినా ఇంకా ఒకే ఒక్క కోరిక మిగిలిపోయింది. బహుశః జీవితాంతం ఆ కోరిక కోరికలాగానే వుండిపోతుందేమో? ఆ విషయంలో మాత్రం తను చాలా దురదృష్టవంతుడు. సంధ్యలేని జీవితం ఎడారిలో వెన్నెలలాంటిది. సంధ్య

లేకపోతే తన జీవితానికి వెలుగే లేదు.

*　*　*

ఆ రోజు ఆఫీసులో పని ఎక్కువగా లేకపోవటంతో తీరిగ్గా కూర్చొని ఆలోచిస్తున్న వినయ్ దూరం నుండి తనదగ్గరకే వస్తున్న సంధ్యని చూసి కొంచెం ఆశ్చర్యపోయాడు.

"బావా! అర్జంటుగా నీతో పని వుంది, ఈరోజు ఆఫీసుకి శెలవ్ పెట్టి నాతో రాగలవా?...."

"ఎక్కడికి?...."

అదంతా తరవాత చెపుతాను. ముందు లీవ్‌లెటర్ ఇచ్చిరా!"

ఆఫీసరు వూర్లో లేడు. సెక్షన్ సూపర్‌వైజర్‌కి లీవ్‌లెటర్ ఇచ్చి సంధ్యతోపాటే బయటకు నడిచాడు వినయ్.

సంధ్య ఆటోని పిలిచి ఎక్కమన్నది. వినయ్ ఆశ్చర్యంగా చూస్తో ఆటో ఎక్కాడు. ఆటో డ్రైవర్‌కి సంధ్య ఏదో చెప్పింది. ఆటో కదిలింది.

తనకి తెలుసు- సంధ్యనిప్పుడు ఏమడిగినా చెప్పదు. సంధ్యతత్వమే అంత. ఏదయినా చేసి తీరాలంటే అది వెంటనే చేసి తీరుతుంది. ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని అడ్డంకులు ఎదురయినా, చేసేవరకు చెప్పదెవరికీ. తినబోతూ రుచి అడగటమెందుకులే- అని వూరుకున్నాడు.

ఉన్నట్లుండి గుర్తుకొచ్చింది వినయ్‌కి, ఆరోజు సంధ్య జన్మదినమని. "హాపీ బర్త్‌డే టు యూ!" సంధ్య వైపు తిరిగి నవ్వుతూ అన్నాడు.

"థాంక్యూ! ఫరవాలేదు నా బర్త్‌డే డేటు మీకు గుర్తుంది. ఇంతకీ ఈ రోజు నాకేం కానుక ఇస్తారు?"

వినయ్ తల దించుకున్నాడు. ఏమీ మాట్లాడలేదు. ఏక్సిడెంట్ జరగకముందు తను అవిటివాడుగా మారక ముందయితే ఈ సందర్భంలో సంధ్యని రెండు చేతులతో తన కౌగిలిలో బంధిస్తూ- "ఇదే నా కానుక" అని అనగలిగేవాడు కానీ ఇప్పుడు తను అవిటివాడు. అంతటి చొరవ తనిప్పుడు తీసుకోలేడు- సంధ్య మనసు తెలుసుకోకుండా! తన కాలుతోపాటే ఆ హక్కుని కూడా కోల్పోయాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? మీరేం ఇవ్వనక్కరలేదు. నే నే మీకు ఇస్తాను" అంటుండగా ఆటో ఒక బిల్డింగ్ దగ్గరకు వచ్చి ఆగింది.

ఆశ్చర్యంగా చూసాడు సంధ్య వైపు.

"దిగండి!" నవ్వుతూ అంది-తను దిగుతూ. అప్పటికే సంధ్య స్నేహితులు నలుగురైదుగురు అక్కడ వున్నారు. సంధ్య చెయ్యి అందిస్తే ఆ చేతిని ఆసరాగా తీసుకుని ఇంకొక చేతితో కర్రని చంకలో సర్దుకుంటూ ఆటో దిగాడు వినయ్.

అంటే సంధ్య అంతా సిద్ధం చేసుకొనే వచ్చిందన్నమాట!

సంధ్యని ప్రక్కకి తీసుకెళ్ళి అడిగాడు-"సంధ్యా! ఏమిటిదంతా? బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నావా?"

"బావా! బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఆవేశంలో గాని, తొందరలోగాని తీసుకున్న నిర్ణయం కాదిది. 'చూస్తూ, చూస్తూ అవిటి వాడిని ఎందుకు చేసుకుంటున్నావు?' అనేకదూ నీ సందేహం! బావా- ఒకవేళ నీకు, నాకు పెళ్ళయిన తరువాత ఈ ఏక్సిడెంట్ జరిగి నీకిలా అయితే అప్పుడు నేనేం చేసేదాన్ని? అవిటి వాడివైనావని నిన్నొదిలి వెళ్ళేదాన్నా? చెప్పు బావా! బాహ్య సౌందర్యంకాదు చూడాల్సింది- ఆత్మ సౌందర్యం మనిషిలో. బావా! నీ మనసు నాకు తెలుసు. నన్ను నన్నుగా ప్రేమించే నీ లాంటి ఆరాధ్య దైవాన్ని వదులుకునేంత మూర్ఖురాలు కాదీ సంధ్య! నిన్ను చేసుకుంటే నా తల్లిదండ్రులు నాకు దూరమైనా, కూతురులా చూసుకునే అత్తయ్య అండ వుంది నాకు. పెద్ద వారి స్వార్థపూరిత ఆలోచనలకి, వాళ్ళ మూర్ఖపు పట్టుదలకి నా జీవితాన్ని బలి చేసుకోమంటావా? అది వల్లకాటితో సమానం. అది నావల్ల కాదు. 'ఈ నిర్ణయం ఇంతకు ముందే ఎందుకు తీసుకోలేదు?' అని అడగవచ్చు. బావా! ఈ రోజే నేను 'మేజర్' నయ్యాను. నే నీ పెళ్ళి చేసుకున్నా చట్టం దృష్టిలో ఇప్పుడు నేరం కాదు. అందుకే ఈ రోజు గురించి ఇన్నాళ్ళూ ఎదురుచూశాను. కాదనకు బావా! ప్లీజ్!..."

వినయ్- సంధ్యల వివాహం నిరాడంబరంగా రిజిస్ట్రార్ ఆఫీసులో ఐదుమంది సాక్షుల సంతకాలతో పూలదండల మార్పిడితో జరిగిపోయింది. ఆ తరువాత అందరూ కలసి వినయ్ వాళ్ళింటికెళ్ళి లత ఆశీర్వాదాలు తీసుకొన్నారు. ముందు ఆశ్చర్యముతో చూసి, ఎవ్వరికీ చెప్పకుండా చేసుకున్నందుకు కొంచెం కోప్పడి ఆ తరువాత ఆనందంగా నిండు మనసుతో ఆశీర్వదించింది.

అక్కడినుండి అందరూ కలసి సంధ్య వాళ్ళింటికెళ్ళారు. అక్కడ

జరిగే శివ తాండవం ముందే వూహించారు. కాబట్టి వాళ్ళిచ్చిన శాపనార్థాలు, దెప్పి పొడుపులు మౌనంగా భరించారు. కొద్దిసేపు వుండి అందరూ కలిపి నచ్చచెప్పిన పిదప, కోపం చల్లారి శాంతించిన తరువాత వాళ్ళ ఆశీర్వాదాలతో అక్కడినుండి కదిలారు.

* * *

ఆ రాత్రి మొదటి రాత్రి-

"సంధ్యా! నేను ఇద్దరికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి."

"ఎవరెవరికి? ..."

ఆప్యాయతగా తన అవిటి కాలును నిమురుతూ, "దీనికి" అన్నాడు వినయ్. ఆశ్చర్యంతో ప్రశ్నార్థకంగా చూసింది వినయ్ వైపు.

"అవును సంధ్యా! ఏక్సిడెంట్లో ఈ కాలు పనికిరానిదిగా తయారవకపోతే నాకీ ఉద్యోగం దొరికేదా? జీవితం ఎంత విచిత్రమైనది. క్వాలిఫికేషన్ వుండి, అన్ని అవయవాలతో ఆరోగ్యంగావున్నా ఉద్యోగం సంపాయించలేక పోయానప్పుడు. ఇప్పుడు కాలు పనికిరాకపోయినా ఫిజికల్లీ హాండీకాప్డ్ అనేబిరుదు నిచ్చి ఉద్యోగంతో సత్కరించారు. ఈథియరీ ప్రకారం ఆరోగ్యంగా వున్నవారు వుద్యోగానికి అనర్హులన్నమాట. ఈ అవిటితనం నాకొక అర్హతలాగా పనిచేసింది- వుద్యోగానికి. అంతేకాదు-నా వ్యక్తిగత జీవితంలోకూడా ఇది నాకెంతో సహాయపడింది. ఎలా అంటే ఈ అర్హత లేకుండా నాకు వుద్యోగ అవకాశాలు చాలా అరుదుగా వుండేవి. వుద్యోగం లేకుండా నిన్ను చేసుకునే ధైర్యం నాకుండేదికాదు. ఇవేకాదు-వుద్యోగం రావడంవల్లనే కదా నా కుటుంబాన్ని పోషించగలుతున్నాను. ఇంతకు మునుపు నన్ను నేనే పోషించుకోలేని స్థితిలో వుండేవాడ్ని. సంధ్యా! ఈ అవిటితనం నాకు శాపంకాదు-దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను. ఇది నా ఎడిషనల్ క్వాలిఫికేషన్. నాకిదొక అర్హత!" ఆవేశంగా అన్నాడు వినయ్.

"అయితే వుద్యోగం దొరకని యువకులందరినీ అవిటి వాళ్ళుగా మార్చేస్తే మన దేశంలో నిరుద్యోగ సమస్య వుండదుగా" నవ్వుతూ అంది సంధ్య.

"ఆ అదృష్టం అందరినీ వరించదుగా?"

"సరేగాని ఇంకొక కృతజ్ఞత ఎవరికి? చెప్పనేలేదు మీరు."

"నన్ను చేసుకుని నేనన్నింటికీ అర్హుడనేనని సంఘానికిచాటిచెప్పిన ఈ అమ్మాయిగారికి" అంటూ వినయ్ సంధ్యని కౌగిలిలోకి తీసుకున్నాడు. ఆ బిగి కౌగిలిలో మత్తుగా కరిగిపోయింది సంధ్య. *